క్లుప్తంగా

ఉన్నతంగా కళాశాల నిర్వహణ



సీఆర్ఆర్ ప్రతినిధులకు నివేదిక సమర్పిస్తున్న నాక్ బృందం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలకు నాక్ గుర్తింపు కోసం ఈ నెల 24, 25 తేదీల్లో నాక్ బృందం కళాశాలను సందర్శించింది. ఈ బృందం కళాశాలలోని మౌలిక సదుపాయాలను పరిశీలించి కళాశాల యాజమాన్యానికి కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఎగ్జిట్ మీట్‌లో ప్రిన్సిపాల్ శైలజకు నివేదిక అందజేశారు. కళాశాల నిర్వహణ ఉన్నతంగా ఉందని అభినందించారు. బృందంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మరాట్వాడా యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాలు చోపడే, గురుగావ్ కేఆర్ మంగళం యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ నేహా జైన్, ఖిలాలాబాద్ హీరాలాల్ రామ్‌నివాస్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అయజ్ కుమార్ పాండే ఉన్నారు.

బాబాకు శాకంబర అలంకరణ



ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక తంగెళ్లమూడిలోని బూడిద అప్పన్న వీధిలోని సాయి బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. బాబాకు వాసా ప్రసాదరావు ఆధ్వర్యంలో వివిధ రకాల కాయగూరలు, ఆకు కూరలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

ఏలూరు రూరల్ : ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరం ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ పబ్లిక్ హియరింగ్ నిర్వహించనున్నామని ఉపాధి హామీ పథకం మండల ప్రాజెక్టు ఆఫీసర్ కిషోర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశాన్ని డ్వామా పీడీ ఎ.రాము నిర్వహిస్తారన్నారు. 2023–24 మధ్య కాలంలో మండల గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పూర్తి చేసిన పరిశీలనపై చర్చిస్తారని వివరించారు. సమావేశంలో మండల స్థాయి పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

గురువులుగా పట్టాభిషేకం

ఏలూరు (ఆర్ఆర్ పేట): ఏలూరు కథోలిక పీఠం పరిధిలో గురువులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ముగ్గురు ఫాదర్లకు గురువులుగా పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించారు. బిషప్ పొలిమేర జయరావు గురు పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాన్ని ఏలూరు బిషప్ హౌస్‌లో ఘనంగా నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో మాట్లాడండి

- ఎమ్మెల్యే చంటిని కోరుతున్న ప్రజలు
- ఏలూరు వన్‌టౌన్ అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ సమస్య
- తమ్మిలేరు ఏటిగట్టు 3వ దశ రివిట్‌మెంట్ నిర్మించాలి
- అమృత్ 2.0 నిధులు రప్పించాలి

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలోని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎమ్మెల్యేగా ఎన్నికైన బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా అసెంబ్లీ సాక్షిగా ప్రజా గళాన్ని వినిపించాలని జనం కోరుతున్నారు. నగరంలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ, రోడ్లను అభివృద్ధి చేయాలంటున్నారు. ఈ ఐదేళ్ల పాలనలో అత్యంత ప్రాధాన్యత గల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అడుగులు వేయాలని కోరుతున్నారు.

వన్‌టౌన్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ

ఏలూరు నగరం వన్‌టౌన్ ప్రాంతంలో దశాబ్దాలుగా అండర్‌గ్రౌండ్ సమస్య వేధిస్తోంది. వర్షం పడితే చాలు డ్రెయినేజీలు పొంగిపోతూ రోడ్లపై మురుగు నీరు పారటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో వన్‌టౌన్ ప్రాంతంలో రూ.1 కోటి నిధులతో కొంతమేర అండర్‌గ్రౌండ్ పనులు చేపట్టారు. అమృత్ 2.0 పథకంలో వన్‌టౌన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, తాగునీటి సరఫరాకు రూ.112 కోట్లు నిధులకు గత ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఈ నిధులను మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ చూపించాలి.



వన్‌టౌన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం (ఫైల్)

తమ్మిలేరు ఏటిగట్టు రివిట్‌మెంట్

ఏలూరు నగర ప్రజలకు దుఃఖ దాయినిగా మారిన తమ్మిలేరు వరద ముంపు నుంచి నగర ప్రజలకు శాశ్వత రక్షణ కల్పించేందుకు దివంగత వైఎస్సార్ సీఎంగా, మాజీ ఎమ్మెల్యే ఆళ్లనాని హయాంలో రూ.18 కోట్లుతో మొదటి దశ, వైఎస్సార్ సీపీ హయాంలో రూ.80 కోట్లతో రెండో దశ ఏటిగట్టు రివిట్‌మెంట్ పనులు పూర్తి చేశారు. ఇక మూడో దశలో 2.5 కిలోమీటర్ల మేర తమ్మిలేరు ఏటిగట్టు నిర్మాణానికి సుమారు రూ.55 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ మూడో దశ పనులను చేపట్టేందుకు నిధుల మంజూరుకు కృషి చేయాలి.



తమ్మిలేరు రెండో దశ రివిట్‌మెంట్ (ఫైల్)



వన్‌టౌన్ ప్రాంతం వ్యూ (ఫైల్)

అమృత్ 2.0 నిధుల మంజూరుకు

ఏలూరు నియోజకవర్గంలో అమృత్ 2.0 పథకంలో భారీగా రూ.361 కోట్లు నిధులు మంజూరు చేస్తూ గత ప్రభుత్వం జీఓ జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర నిధులతో చేపట్టే ఈ ప్రాజెక్టులో ఏలూరు నగరపాలక సంస్థలో విలీనమైన ఏడు గ్రామ పంచాయతీల్లోని సుమారు 80 వేల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. విలీన గ్రామాలకు గోదావరి జలాలను ఇంటింటికీ సరఫరా చేసేందుకు రూ.129 కోట్లు నిధులు కేటాయించారు. నగరంలోని ఆరు చెరువుల అభివృద్ధికి రూ.8 కోట్లు కేటాయించారు, ఈ నిధుల మంజూరుకు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంది.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి



ఏలూరు నగర ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ఎమ్మెల్యే బడేటి చంటి కృషి చేయాలి. మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని హయాంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరు, నిర్మాణం, 29 వేల మందికి జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ, ప్రధాన రహదారుల అభివృద్ధి ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల సంక్షేమంతోపాటు, నగరాన్ని అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

– సుంకర చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ ఏలూరు క్లస్టర్–1 అధ్యక్షుడు

ఏలూరులో స్టాప్ డయేరియా

ఏలూరు టౌన్: దోమల నిర్మూలనకు, డయేరియా నివారణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఏలూరు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి అన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి ఆదేశాల మేరకు స్టాప్ డయేరియా ప్రోగ్రామ్ చేపట్టామన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏలూరు 28వ డివిజన్‌లోని ద్వారకానగర్, బీడీ కాలనీ, వాణినగర్ తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు మురుగు కాలువలు, నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేయటంతోపాటు, ఫాగింగ్ చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తంగిరాల సురేష్, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాలస్వామి, సూపర్‌వైజర్ డి.దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వరరావు, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



28వ డివిజన్‌లో దోమల నిర్మూలనకు ఆయిల్ బాల్స్ నీటి నిల్వల్లో వేస్తున్న డాక్టర్ మాలతి

ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

ఏలూరు (టూటౌన్): ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో జాయింట్ సెక్రెటరీ మినహా మిగిలిన అన్ని పదవులకూ ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో కార్యవర్గం ఏకగ్రీవమైనట్టు ప్రస్తుత అధ్యక్షుడు అబ్బినేని విజయ్ కుమార్ తెలిపారు. జాయింట్ సెక్రెటరీ పదవికి గెల్లా శ్రీనివాసరావు, నోముల రాముడు ఇద్దరు పోటీ పడటంతో ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ఒక్క పదవికి వచ్చే నెల 2న ఎన్నిక నిర్వహిస్తామన్నారు. ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోనే సీతారామారావు, ఉపాధ్యక్షుడిగా మాండ్రు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శిగా చింతమనేని రమేష్, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా తిరిగిపల్లి సుబ్బారావు, కోశాధికారిగా బందెల నానాజీ, లైబ్రరీ కార్యదర్శిగా ఎంజీవీఎస్ ఫణికుమార్, మహిళా ప్రతినిధిగా పుట్టా కనకదుర్గా భవాని ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు.



అధ్యక్షునిగా ఎన్నికైన సీతారామారావుకు నియామక పత్రం అందిస్తున్న నిర్వాహకులు

ఉపాధ్యక్షుడికి అభినందనలు

ఏలూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మాండ్రు రాజేంద్రను ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అభినందించారు. ఇప్పటికే సీబీడీ పీపీగా తనదైన శైలిలో సేవలందిస్తున్న రాజేంద్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికవడం అభినందనీయమని కొనియాడారు. అభినందనలు తెలిపిన వారిలో వెంపా నాగరాజు, భూషణం ఉన్నారు.



ఉపాధ్యక్షుడు రాజేంద్రను అభినందిస్తున్న సంతోష్ కుమార్, తదితరులు

వరద బాధితులకు విరాళాల సేకరణ

ఏలూరు (టూటౌన్): భారీ వర్షాలు, వరద బాధితుల సహాయార్థం సీపీఎం విరాళాల సేకరణ చేపట్టింది. వారం రోజులుగా స్థానిక పవరుపేట, ఆర్ఆర్‌పేట ప్రాంతాల మార్కెట్‌లో ఇప్పటి వరకు రూ.6,750 సేకరించింది. ఈ మొత్తాన్ని పార్టీ జిల్లా కమిటీ ద్వారా నిర్వాసిత గ్రామాలకు నిత్యావసర సరుకుల పంపిణీ నిమిత్తం అందజేస్తామని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలు కుక్కనూరు, వేలేరుపాడు మండలాల్లో 25 గ్రామాలుకు పైగా వరద తాకిడికి గురయ్యాయని చెప్పారు. ప్రస్తుతం అక్కడి ప్రజానీకం కొండలు, గుట్టలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లో తలదాచుకుంటున్నారని వివరించారు. ఇప్పటికైనా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందజేయాలని కిషోర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.జగన్నాథరావు, వి.సాయిబాబు, ఎం ఇస్సాక్, జె.గోపి, జి.శారద, ఎం.సత్యనారాయణ, పి.దుర్గాప్రసాద్, కె.లెనిన్, అల్లం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా సాంస్కృతిక దినోత్సవం



దేశభక్తి గీతానికి నృత్యం చేస్తున్న విద్యార్థినులు



దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ విద్యావిధానం (ఎన్ఎస్ఈపీ)–2020 నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా గురువారం సాంస్కృతిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వ భావాన్ని పెంపొందించేలా చేయడంతోపాటు విభిన్న నృత్య ప్రదర్శనలు, పాటలు, గేయాలాపన వంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఏలూరు నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశభక్తి గేయాలకు నృత్యాలు చేయడం, విద్యార్థుల్లో వివిధ అంశాలపై చైతన్యం కలిగే కథాంశాలతో నృత్య రూపకాలు ప్రదర్శించడం, విచిత్రవేషధారణలు, దేశ నాయకుల వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు.

బాలుర వసతి గృహంలో సేవలపై ఆరా



ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ స్థానిక శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని గురువారం సందర్శించారు. వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రత, పిల్లల భద్రత, వైద్య సదుపాయాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి తగు సూచనలు చేశారు. బాలురు తమకు విద్యాబోధన చేసేందుకు సరైన ఉపాధ్యాయులు సౌకర్యం లేదని ఫిర్యాదు చేయగా, తక్షణం సమస్యకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ పి.శ్రీవల్లి వసతి గృహ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు చలో పొన్నూరు

ఏలూరు (టూటౌన్): గుంటూరు జిల్లా పొన్నూరులో ఈ నెల 27న నిర్వహించే దళితుల ఆత్మగౌరవ పోరాట యోధుడు కవి రచయిత డాక్టర్ కత్తిపద్మారావు పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత బహుజన నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక కొత్తరోడ్డులోని నవ సమాజ సొసైటీ కార్యాలయంలో చలో పొన్నూరు కార్యక్రమ కరపత్రాన్ని గురువారం విడుదల చేశారు.

30న ఏలూరు మండల పరిషత్ సమావేశం

ఏలూరు రూరల్ : ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన ఈనెల 30న ఉదయం 10.30 గంటలకు ఏర్పాటుచేయనున్నట్టు ఎంపీడీఓ బి.ప్రణవి తెలిపారు. మూడునెలలకు ఒకసారి జరిగే సమావేశంలో మండలభివృద్ధితో పాటు సమస్యలపై సభ్యులు చర్చిస్తారని పేర్కొన్నారు.

అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలి

పెదవేగి: అర్హులైన కౌలురైతులందరికీ ఖరీఫ్ సీజన్ దృష్ట్యా బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ హబీబ్‌బాషా అన్నారు. గురువారం పెదవేగి మండలం కొప్పాక గ్రామంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా కౌలు రైతు కార్డు ఉన్న రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుకు వెళ్ళి మేనేజర్‌ను కలిసి బ్యాంకు పరిధిలో ఉన్న కొప్పాక, బి.శింగవరం, పెదకడిమి, పినకడిమి, అంకన్నగూడెం, అమ్మపాలెం, భోగాపురం గ్రామాల్లో కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు అందించాలని కోరారు. అనంతరం రైతులను ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తమ పరపతిని కౌలు రైతులు పెంచుకోవాలని సూచించారు. జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు, మండల వ్యవసాయ శాఖాధికారి ఎం ప్రియాంక, రైతులు ఉన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. వైభవ్ పోర్ట్ ప్రాంతం, అగ్రహారం, వెన్నవల్లివారి పేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, లంబాడీ పేట, బావిశెట్టి వారి పేట, నల్లదిబ్బ, కెనాల్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, శాంతి నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రేవియర్ నగర్, కట్టా సుబ్బారావు తోట, విద్యా నగర్ సాయి బాబా మందిర ప్రాంతం, శాతవాహన నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఏలూరు మండలం చాటపర్రు – గుడివాక లంక , చాటపర్రు – మల్కాపురం ఫీడర్ల పరిధిలో చాటపర్రు జగనన్న కాలనీ, చాటపర్రు గ్రామంలోని చేపల చెరువులకు ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

పీఠాధిపతి జయరావుకు ఘన సన్మానం

దెందులూరు: ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి, విశాఖపట్టణం అగ్రపీఠాధిపతి పొలిమేర జయరావు ఏలూరు పీఠాధిపతిగా అభిషేకం పొంది 11వ సంవత్సరం కావడం సంతోషంగా ఉందని అగ్రపీఠాధిపతి కార్డినల్ పూల ఆంథోని, నల్గొండ పీఠాధిపతి కరణం థామస్ కుమార్ అన్నారు. గురువారం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ కళాశాలలో కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి.మోజెస్ ఆధ్వర్యంలో జయరావును ఘన సన్మానించారు. ఏలూరు పీఠంలో ఆయన సేవలను, ప్రణాళికను ఫాదర్ మోజెస్ కొనియాడారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జాకబ్, ఫాదర్లు ఫెలిక్స్, బాబు జార్జి, ప్రిన్సిపాల్ స్లీవరాజు, వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, డాక్టర్ అరుణ్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు గజమాలతో సత్కరించారు.



ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి జయరావును సత్కరిస్తున్న దృశ్యం

తొలగని వర్షపు నీరు



చల్లచింతలపూడిలో ఆయిల్‌ఫామ్ తోటలో నిలిచిన వరద నీరు

దెందులూరు: భారీ వర్షాలకు తోటలు, పొలాల్లో చేరిన నీరు బయటకు పోయే మార్గం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపునీరు దిగువ ప్రాంతానికి వెళ్లే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పొలాలకు ఇబ్బంది లేకుండా రైతులు చర్యలు తీసుకున్నారు. మెట్ట ప్రాంతాలైన చల్లచింతలపూడి, ఇతర గ్రామాల్లో పామాయిల్ తోటలు, పండ్ల తోటలు, వరి పొలాలు ముంపులోనే ఉన్నాయి.

నిత్యావసర సరుకుల పంపిణీ

భీమడోలు: భారీ వర్షాలకు భీమడోలు గ్రామంలోని పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బాధిత కుటుంబాలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. బీసీ కాలనీకి చెందిన మీసాల పరుశురాముడు, బి.ఆదిలక్ష్మి, చోడిశెట్టి బేబి, కోడిని నరసమ్మ, జలసూత్రం కనకమ్మ, లంక నరసమ్మ, షేక్ మున్నీ, పోలసానిపల్లికి చెందిన కూనా కొండమ్మ కుటుంబాలకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు మాట్లాడుతూ పేదలను ఆదుకోవడానికి మానవత ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎడిటోరియల్ చైర్మన్ రామిశెట్టి గంగాధరరావు, జిల్లా కోశాధికారి పసుపులేటి సాంబశివరావు, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, జిల్లా డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, పెద్దలు తాటిమళ్ల రామ్మూర్తి, అభివృద్ధి కమిటీ సభ్యులు పోలిశెట్టి సత్యనారాయణ, ఉన్నమట్ల సత్యనారాయణ, చిలపర్తి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	రద్దు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	29
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	33
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు – తిరుపతి	16.00	4830	31

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	7, 10
బెండకాయలు	36	కంద	68
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	36
కాకర కాయలు	44	కీరా దోస	50
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	44	అల్లం	100–160
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	15–18
క్యారెట్	32–56	పాలకూర	12–15
దొండకాయలు	34	చుక్కకూర	12–15
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	44